# సతీ సరళ

శ్రీ పెద్దిబోయిన ప్రసాదరావు

[ ఈ మా కథకుడు శ్రీ రాజరాజేశ్వరిపిక్చర్సువారి "తల్లిప్రేమ" కు సంభాషణలు వ్రాస్తున్న కవి. ఉత్సాహంగల యువకుడు. ఇక భావాలు ఎలా వుంటాయో చెప్పాలా! అందుకు యీ కథ చదవండి. ]

ముసలమ్మ మాట నెగ్గింది. తన మనుమరాలగు సరళను ఇంజినీయరుగారి పుత్రుడగు వెంకటేశానికిచ్చి వివాహం జేసింది. ఈ వివాహం సరళకేమాత్రం యిష్టంలేదు. ఆఫీసర్ల ప్రాపకం కలుగుతుందని ముసలమ్మ భ్రమపడి, అహోరాత్రులూ యోచించి, ఈశుభ కార్యం జరిపించింది.

సరళ, విద్యావతి. మాతృభాష నేగాక, నాల్గు మూడు ప్రాంతీయ భాషల్నికూడా. చదివింది. గాంధీ మహాత్ముని సత్యాగ్రహోద్యమ మంటే చాలా ప్రీతి. అప్పుడప్పుడూ పత్రికలలో వ్యాసాలు రాస్తూ, పత్రికా సంపాదకుల మన్నలకు పాత్రురాలవుతూ వుండేది. తన వివాహాని కొకనెల రోజుల పూర్వం "అనుకూల దాంపత్యం" అనే వ్యాసాన్ని, ఒకానొక పేరుగల పత్రికలో ప్రకటపరచింది. ఆ వ్యాసాన్ని చదివిన స్త్రీ, పురుషులంతా, పదునాలుగేండ్ల ప్రాయానికే, ఇంతటి భావ పరంపరలను కురిపించిన సరళను మెచ్చుకొన్నారు. ఆమె చిరునామాను తెలిసికొన్న వారందరూ అభినందన లేఖాపరంపరలను కురిపించారు. వివాహ యోగ్యురాలయిన సరళయొక్క పరిణయ కాలమందు, చాలామంది వచ్చి ఆశీర్వదించా లనుకొన్నారు కూడాను.

కాని, మానవు డొకటితలిస్తే, దేవుడు మరియొకటి తలుస్తా డన్నట్లు, సరళయొక్క వివాహం యెవ్వరికీ తెలియకుండా జరిగిపోయింది. ఇదంతా ముసలమ్మ చేసిన మోసం. ఈ పరిణయ విషయం యెవ్వరికైనా తెలిస్తే, కట్నా లెక్కువిస్తామని చెప్పి, ఇంజినీయరు గారబ్బాయిని తిరుగదీస్తారని ముసలమ్మ పన్నాగం పన్ని మరీ యీ పెళ్ళిజేసింది. శుభలేఖలు ప్రచురపరచడానికి ఒప్పుకోలేదుసరిగదా, దూరానున్న దగ్గరబంధువులికికూడా, ఉత్తరం ముక్క రాస్తాని కంగీకరించలేదు ముసలమ్మ.

ఇక వెంకటేశంమాట. ఇతడు చెళ్ళపిళ్ళ రాయడు. ఫోర్తుఫారం పరీక్ష మూడేళ్లు తప్పాడు. నాలుగోయేడు యేదో ఒకవిధంగా జయమొందాడు. ఫిఫ్తుఫారంలో జేరాడు. ఒకానొక రోజున వెంకటేశం, పుస్తకాలకనీ, జీతానికనీ యింటిబద్దనుండి యాభై అయిదు రూపాయిలు తెచ్చాడు. సరాసరి రీడింగు రూములోకిపోయి పత్రిక చదువడం మొదలెట్టాడు. సినిమా విషయాలు చదువడమంటే అతని కెక్కువ సర్దా. ఆ అలవాటు చొప్పున ఆనాడు కూడా, సినీమాపుట చూడ్డం మొదలెట్టాడు. హఠాత్తుగా ఒకానొక చోట, "నటీనటులు కావాలి. దరఖాస్తులతోపాటు ఫోటోలుగూడా పంపాలి." అని వున్న ఒకానొక కంపెనీయొక్క అడ్వర్టయిజుమెంటు చూచాడు. కొంచెంసేపు మౌన ముద్రాలంకారుడయ్యాడు...ఆలోచించాడు, ఒక్క వేడి నిట్టూర్పువిడిచాడు. అక్కడినుంచి లేచి, ఫోటోగ్రాఫరు వద్దకు ప్రయాణ మయ్యాడు. కొంతదూరంపోయి మళ్లీ ఆలోచించాడు.

"ఫోటోలుతీసి పంపించడంకంటే, పర్సనలుగా వెళ్ళి, డైరెక్టరుగారిని కలిసికొని బ్రతిమాలుకొంటే మేలు. లేకపోతే, ఫోటోలు పంపేవాళ్లు ఎన్నోవందల మందుంటారు. వాళ్ళందర్నీ సెలక్టు చేసుకొంటారా? ...చేసుకోరు......కాబట్టి, వెళ్లడమే వుత్తమ మని తలంచి, సరాసరి రైల్వే స్టేషనుకు పోయి మద్రాసుకు టిక్కెట్టు కొన్నాడు...మరుసటిరోజు మద్రాసుచేరి గమ్యస్థలానికి వెళ్ళాడు. వెళ్ళి వెళ్లడంతోనే—"నో వేకెన్సీ" అని వ్రాసి గోడకు తగిలించబడివున్న బోర్డునుచూచి నిర్ఘాంత పోయాడు. "ఖాళీలేక పోయినట్లయితే, పేపర్లలో ఎడ్వర్టయిజుమెంటు ఎందుకు చేస్తారూ?— డాబుసరికా!... కాదు కాదు...తినబోయి రుచితెలిసికోవడ మెందుకని, వేగంగా డైరెక్టరుగా రున్న రూములోకిపోయి, డైరెక్టరుగారికి గుడ్

మార్నింగ్ చేశాడు. తన విషయమంతా చెప్తున్నాడు డైరెక్టరుగారు వెంకటేశం యొక్క చరిత్రంతా విని "నువ్వేమైనా పాడగలవా!" అని అడిగాడు. "నోసర్" ప్రాక్టీసు చెయ్యలేదండి అన్నాడు. అల్లాగయితే నీకు మాఫిలింలో చోటు దొరకదన్నాడు డైరెక్టరు విసుగుదల భావంతో—

"ఏ చిన్న వేష మిచ్చినా సరే వుంటానండీ— నాసంతోషాన్ని వృధాచెయ్యకండి— మీమేలును ఆ జన్మ పర్యంతరం మరచిపోను" నాకేమీ డబ్బొద్దు. అన్నాడు వెంకటేశం.

డైరక్టరు—అధిక ప్రసంగం చెయ్యబోకు. గెట్ యొవే!—నువ్వు ధనంకోరకాశించకుండా వేషం వేస్తావు సరేగాని, నీభోజనపానీయాలకుమాత్రం ధనం కావద్దూ?

వెంక:—డియర్ సార్! చిత్తగించండి—నావద్ద ఫార్టీ యెయిట్ రూపీస్ వున్నాయండి. దీనితో నేను భోజనంచేసి, నేను మీ కంపెనీలో యాక్టు చేస్తానండి.

డైరెక్టరు:—వెరీవెల్! అట్లాగైతే, నాకేమీ సందేహంలేదు. నీదగ్గరున్న ఫార్టీయెయిట్ రూపీసూ నాచేతికిచ్చి, మాలాడిజంగ్ లోనే భోజనం చెయ్యి.

వెంకటేశం సంతోష సాగరంలో మునిగిపోయాడు. తనదగ్గరున్న ఫార్టీయెయిట్ రూపీసునూ, డైరెక్టరుగారి చేతికిచ్చి, కంపెనీవారి లాడ్జింగులోనికేగాడు—

మూడు నెల్లయ్యింది. వెంకటేశం తల్లిదండ్రులకీ వార్త అప్పటికి తెలిసింది. ఇంజనీయరుగారు మదరాసు వెళ్లి కుమారుని కలిసికొన్నాడు. ఫిలిం షూటింగ్ యింక నాలుగైదు రోజులలో పూర్తిగానుంది. వెంకటేశానికింతవరకూ యేవేషమునూ వా యివ్వలేదు. తండ్రిగారు చీవాట్లు పెట్టియింటికి పోదాం రమ్మన్నాడు. వేషం వెయ్యందే రానన్నాడు వెంకటేశం—ఇంజనీయరుగారు డైరెక్టరుగారి దగ్గరకెళ్లి "అయ్యా! నాకుమారుడగు వెంకటేశం మీకంపెనీలో వున్నాడు. ఇంతవరకూ అతనికేవేషమూ యివ్వలేదంట. దయచేసి యేదో ఒక వేషం వేయించండి" అని సిఫార్సుచేశాడు. పెద్దవారి మాటను త్రోసివెయ్యలేక కిరాతుని వేష మిచ్చారు వెంకటేశానికి. ఆపాద మస్తకంవరకూ కప్పబడినవల్లని దుస్తులతో వెంకటేశ మావేషాన్ని వేసి, డైరెక్టరుగారి సెలవుపొంది, తండ్రితోపాటు యింటికొచ్చాడు.

వెంకటేశం తల్లిదండ్రుల కిదంతా చాలా కష్ట సంభరితమై పోయింది. వివాహం జేస్తేనేగాని. తమ కుమారు డెక్కడికీ పోడని సరళను కోడలిగా గైకొన్నారు—పరిణయమై పట్టుమని పది దినాలుగాలేదు. ఒకనాటిరాత్రి, పదిగంటలవేళ, వెంకటేశం, ఒంటరిగా పరుండివున్న సరళ గదిలోకొచ్చాడు చల్లగా సరళను లేపాడు. ధగద్ధగాయమానంగా వెలుగొందుతూన్న విద్యుచ్ఛక్తి కాంతిలో, తనను నిద్రమేల్కొల్పినవాడు తన-భర్తయగు వెంకటేశమని గ్రహించింది. లజ్జాన్వితవదనంతో, పడక మంచంనుండి లేచి, ఒకమూలకు పోయింది.

"సరళా! రా! సిగ్గుపడతా వెందుకూ?... నేను నీభర్తను గాదా!" అన్నాడు వెంకటేశం.


## చేతిపనుల
## వర్తక రహస్య బోధిని

సబ్బులు, సెంటులు, పరిమళతైలములు, బాణసంచా అత్తరు, పన్నీరు, పిప్పరమెంటు, మందులు మొదలగునవి సులభముగా తయారుచేయు పరిశ్రమలు 500 గలవు. ధర 1 రూపాయి, పోస్టుఖర్చులు 5 అణాలు.

### కొక్కోకము

స్త్రీ పురుష రహస్యములు 64 చిత్రపటములతో 302 పేజీలుగల పెద్ద పుస్తకము. ధర రు 1-0-0. పోస్టు ఖర్చు రు. 0-5-0 లు. ఇందులో స్త్రీపురుష శృంగార రహస్యములు, శయ్యాగృహ మర్మములు గలవు.

### కుట్టుపని స్వబోధిని

కోట్లు, ట్రౌజర్లు, షర్టులు, జాకెట్లు కత్తిరించి కుట్టు క్రొత్తపద్ధతులు డ్రాయింగులతో గలదు. స్త్రీలు, పురుషులు, బాలికలు యీ గ్రంథముచూచి సులభముగానభ్యసించతగినది. ప్రతిదర్జీవానికిని ముఖ్యముగా చేతిలోవుండవలసిన పుస్తకము. ధర అ. 10.

మహారాజ పుస్తకశాల

అరుణాచలమొదలి వీధి, 18 బీట్సు, మద్రాసు.

సరళ సమాధానం యివ్వలేదు.

"పలుకే బంగారమయ్యిందా! లేకపోతే, విద్యావతినని విఱ్ఱవీగుచున్నావా?" అన్నాడు మళ్లీ వెంకటేశం.

ఈ మాటలు సరళకు ములుకులవలె గ్రుచ్చుకొనుటకు మొదలెట్టాయి. సరళ యింకనూ మౌనంధరించడాని కంగీకరించలేదు.

"కమాన్...మైడియర్ లేడీ!...అంటూదగ్గరకు పోబోయాడు వెంకటేశం.

"పురుషులకు సిగ్గులేదంటా రిందుకే కాబోలు" అంది సరళ కొంచెం లజ్జాన్విత వదనంతో.

"యస్స్" అన్నాడు వెంకటేశం, ఓరగంటి చూపుతో.

"ఆర్యా! మనపెద్దల, జాతి మతాచారాల్ని విడిచి, యిట్లారావడం, తమబోటి విద్యాధికులకు ధర్మమా!" అంది సరళ.

"అదానీ సందేహం. పెండ్లిచేసింది పెద్దలుకాదా ఆపై పనికిమాత్రం పెద్దలు ఒద్దంటారా? తాడుచెట్టెక్కేవాణ్ని ఎంతసేపు పైకెనెట్టుతారూ?...దారిచూపిస్తారు...దానితర్వాత, తనంతట తానే స్వబుద్ధిని వినియోగపఱచుకోవాలి" అని లెక్చరిచ్చాడు వెంకటేశం.

"లోకమంతా యిట్లాగేవుందా? లోకానికైనా వెఱవ వలదా?" అన్నది సరళ, సరళ స్వభావంతో.

"లోకము ప్రాచీనా చారాలలోబడి బంధీకృతమయి పోయింది. ఇది నవయుగ ప్రారంభం...కాబట్టి ...రా..."అని సరళను గట్టిగా కౌగలించు కొన్నాడు వెంకటేశం.

—అబల...భార్య... ఏం జేస్తుంది?... మూకీభావం వహించింది—ఆరాత్రంతా వెంకటేశం...

తెల్లవారింది. ఆనోటా ఆనోటా యీ విషయం అందరికీ తెలిసిపోయింది. ఒక కుండనైతే మూకుడుతో మూయవచ్చుగాని, లోకాన్నంతా ముయ్యడానికెవరి తరం?...అందులో, లోకులు కాకులవంటివారు. అరుణోదయమయ్యేటప్పటికే వూరంతా ఏకరువు పెట్టినట్లయిన యీవిషయాన్ని యింకా సమర్థించడమెట్లా జరుగుతుందీ? ఇంజనీయరుగారి అబ్బాయికి— సరళ— రాత్రి శోభనం— జరిగిందట— ఎవ్వరికీ తెలియకుండా జరిగిందట అని చెప్పుకోవడం మొదలెట్టారు. ఒకమ్మ, "పురుషునికి సిగ్గులేదా" అని వెంకటేశాన్ని తిట్టేది. మరొకమ్మ..."పురుషునికి లేకపోతే స్త్రీకయినా లజ్జుండొద్దా" అనేది. ఇకరీతిగా వూళ్లోవున్న జనమంతా గుంపు చింపులుగా చెప్పుకోవడం మొదలెట్టారు.

ఈవిషయం తెలిసిన ముసలమ్మ, మెదలకుండా మూలజేరింది...ఇంజనీయరుగారా నాటికాఫీసుకు సెలవు పెట్టారు. వెంకటేశం స్నేహితులంతా పరిహాసం చెయ్యడం మొదలెట్టారు వెంకటేశాన్ని. పత్రికా పాఠకులంతా, రచయిత్రీమణులిట్లా వుంటారు కాబోలునని పెద్దపెట్టున నవ్వడం మొదలుపెట్టారు. వెంకటేశానికిదంతా చికాకైపోయింది. ఇక వూళ్లో వుండటానికాస్కారం లేదనుకొన్నాడు. రహస్యంగా, తన యింట్లోవున్న యినుపపెట్టెలోని వందరూపాయిల నోటునూ తీసికొని బొంబాయి ఎక్స్ప్రెస్సెక్కాడు.

మూడు సంవత్సరాలు గడిచిపోయింది. వెంకటేశం జాడలేమీ తెలియలేదు. ఒకానొక రోజున, ఒక ఆంగ్ల దైనికపత్రికలో ప్రకటింపబడింది.

ఏమని అంటే:—

"ఇరువది మూడేండ్ల నవయువకుని కళేబరం—అరేబియన్ సముద్రంలో చేపలను బట్టుచున్న జాలరివాండ్రకు దొరికింది. శరీరం చామనఛాయగా వుంటుంది. గుండ్రని మొఖం. పెద్దకండ్లు. ఆంధ్రునివలె కన్పించుచున్నాడు. ఆ శవానికి చెందిన వారసులెవ్వరూ కాన్పించక పోవడంచేత, ప్రభుత్వంవారే, శవాన్ని దహింప జేశారు."

ఈవార్తను చూచింది సరళ... అతడు తప్పకుండా తన ప్రాణేశ్వరుడే అయివుంటాడని నిశ్చయించుకొంది...ఇప్పుడేం చెయ్యాలి? హిందూమత ధర్మానుసారం విధవత్వాన్ని చేకొనాలా? లేదా?— ఒకవేళ విధవత్వం చేకొంటే, ఆశవము తన భర్తగారిది గాక వేరొకనిదై, తనభర్త ఏనాటికైనా తిరిగొస్తే అప్పుడెంతటి నగుబాటు.

చిట్టచివరకు తన మనస్సులో ఏదో నిర్ణయించుకొంది. సరాసరి మామగారగు ఇంజినీయరుగారి దగ్గరకొచ్చింది. అంతకుపూర్వమే పత్రికలోని విషయాన్ని తెలిసికొన్న ఇంజనీయర్సుగారి యింటెల్లపాదీ విచార సముద్రంలో మునిగున్నారు. అందరూ సరళను చూచారు. ఎవ్వరూ ఏమి మాటాడలేకపోయారు. సరళ కూడా ఏమీ మ్మాటాడలేకపోయింది. ఇదంతా ఒక్క త్రుటికాలం. సరళను ఏదో ఒక విజ్ఞానం మేల్కొల్పింది. వెంటనే "మామగారూ!" అంది, ఆ శబ్దంలో మాధుర్యమూలేదు: విచారమూ లేదు. మామగారు వచ్చీరాని మాటలతో "అమ్మా" అన్నారు. ఇప్పటి నా కర్తవ్యమేమిటో చెప్పండి, అన్నది సరళ.

మామగారు ఏమి చెప్పడానికీ నోరు రాక సందిగ్ధావస్థలో పడిపోయారు. ప్రపంచ జ్ఞానమే లేనట్లుగా కన్నీరు రాల్చారు. తప్పనిసరిగా మాటాడాల్సొచ్చింది—మాటలాడక తప్పదు. కాబట్టి, చిట్టచివరికిలా అన్నాడు: "మా హృదయవేదనకు తోడు నీ వుసురు కూడా పోసికొన్నాము, మేము. రా...మాయింట్లోనే వుండు" అంటూ పెద్దపెట్టున ఏడ్వసాగాడు— ఇంజనీయరు.....

విద్యావతి...సరళ—అది నీచపు బ్రతుకని తలపోసింది. తన జీవితమీ మానవప్రపంచంలో వ్యర్థమైపోయిందని గ్రహించింది. సరాసరి కనకదుర్గాదేవి గుడికేగి, ఎదురుగా చేతులు జోడించి నిలబడి, కన్నీరు గార్చుచు, తల్లీ! దుర్గా!

కన్నులారంగ నాకథఁ—గాంచినట్టి
నీవు, కరుణారసంబును—నిర్వహించి
అవని ననుకూల దాంపత్య—మలరఁజేసి
మనుజులను బ్రోచుచుండుమో—కనకదుర్గ.

అంటూ ప్రార్థించి, కనకదుర్గాదేవి కొండమీదనుంచి, ప్రక్కనేవున్న భవహారిణియగు కృష్ణానదిలో దూకింది ...పరమపావనియగు కృష్ణానదీ తల్లి తనలో చేరవచ్చిన వారిని వలదనునా?— కాదు...సంపూర్ణమైన స్వాగతమిచ్చి తనలో చేర్చుకొంది.

మన మానవలోకమిక సరళను చూడజాలదు... కాబట్టియే ఆమె సతీ సరళ.


# కేసరిగారి

## సుప్రసిద్ధ ఔషధములు

### గర్భరక్షక

గర్భస్రావము, అకాలప్రసవము, రక్తహీనము, శరీరమందు నీరుచేరుట, మలబద్ధకము మొదలగు జబ్బులకు దివ్యౌషధము. సుందరులగు బిడ్డలు సుఖప్రసవము కోరు స్త్రీలు దీనిని సేవించుట అవసరము.
3 ఔ. రు. 2.

### ప్రమేహాంతకం

స్త్రీలకు సర్వసాధారణమగు తెలుపును నివర్తించుటలో దీనికిదియే సాటి.
50 మాత్రలు రు. 2.

### శ్రీఫలాదిపానకం

గ్రహణి, అతిసారము, కడుపునొప్పితో కూడిన జిగటవిరేచనములు వీటిని నమ్మకముగ కుదుర్చును. 3 ఔ. రు. 1.

### వసంతమాలతీ తైలం

కండ్లు చల్లగనుండుటకు, మంచి నిదుర పట్టుటకు యీ తైలమును వాడుట మంచిది: బుద్ధిని హెచ్చించి చదువునందు ఆసక్తి కల్గించును. 6 ఔ. రు. 1.

అన్నిషాపులలోను దొరకును

కేసరికుటీరం, మద్రాస్.

తెలుగుజిల్లాలకు ఏజంట్లు:

శీతారాం జనరల్ స్టోర్సు :: మెయిన్‌రోడ్డు :: బెజవాడ

సికింద్రాబాదు బ్రాంచి :: 4083 స్టేషన్‌రోడ్డు